క్లుప్తంగా

అండగా ఉంటాం..



మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న కళావతి

పాలకొండ రూరల్: మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన బిడ్డిక వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈమె వెంట బిడ్డిక ఆదినారాయణ, సింహాచలం, ఆరిక రజని, రామారావు, కొండగొర్రి తాతయ్య, నీచక రామారావు, తదితరులు న్నారు.

పాలకొండ సీఐగా ప్రసాదరావు



ఆమిటి ప్రసాదరావు

పాలకొండ రూరల్: పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆమిటి ప్రసాదరావు నియమితులైనట్లు ఆ శాఖాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీటీసి నుంచి ప్రసాదరావు ఇక్కడకు రానున్నారని.. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన మీసాల చంద్రమౌళికి విశాఖ సిటీకి బదిలీ జరిగిందని పేర్కొన్నారు.

ప్రజావసరాలు గుర్తించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీవో మురళీధర్

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లోని ప్రజావసరాలను గుర్తించి విజన్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పార్వతీపురం ఐటీడీఏ ఏపీవో మురళీధర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆదికర్మ యోగి పథకం నిర్వహణపై జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామ స్థాయిలో కావాల్సిన కనీస అవసరాలను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించి ప్రణాళికలను (విజన్ మ్యాప్) శిక్షణలో అందించిన అంశాల వారీగా సిద్ధం చేయాలని సూచించారు.

నాగావళికి పోటెత్తిన వరద



గోపాలపురం వద్ద నాగావళి నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి ఉధృతంగా ప్రవహిస్తోంది. నదికి వరదనీరు పోటెత్తడంతో తీరప్రాంత గ్రామాలైన అంపిలి, అన్నవరం, గోపాలపురం, యరకారాయపురం, చిన మంగళాపురం, గొట్ట మంగళాపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై కె.ప్రయోగమూర్తి నేతృత్వంలో సిబ్బంది తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల మండలంలోని అన్నవరం, గోపాలపురం వద్ద ఇద్దరు వ్యక్తులు నదిలో పడి మృతి చెందడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రజల భద్రతపై దృష్టి సారిస్తున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

సామూహిక సీమంతం



గరుగుబిల్లిలో సీమంతాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో గర్భిణులకు బుధవారం సీమంతాలు జరిపారు. సీడీపీవో జి.రజనీదుర్గ గర్భిణులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. గర్భిణులు ఆరోగ్యంపై అలసత్వం వహించకుండా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా భుజించాలన్నారు. వైద్యులు సూచించిన ప్రకారం మందులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు జి.శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్. కవిత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదగుడబ, గరుగుబిల్లి సెక్టార్లలోని గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, పెదగుడబ తదితర గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి గర్భిణులకు గాజులు, జాకెట్, పండ్లు, మిఠాయిలను అందించారు. ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి, సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, బంగారమ్మ, అంగన్‌వాడీవర్కర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సై..!

- ఆసక్తి చూపిన 2731 మంది రైతులు
- గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో 7323.46 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పంటలు
- అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, నాబార్డ్‌ల ఆర్థిక సాయంతో సాగు



గొరడ గ్రామంలో రైతుచే ద్రవ జీవామృతం ఎరువు తయారీ

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగంతో జీవం కోల్పోతున్న భూముల సారానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, నాబార్డ్‌ల యొక్క ఆర్థిక సహాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణ రైతులకు ఎంతో తోడ్పాటునందిస్తోంది.

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో..

అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో కురుపాం మండలంలోని పాడి, పెదగొత్తిలి, తిత్తిరి పంచాయతీలు, గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయిపాక, చినగీసాడ, జర్న పంచాయతీలలోని 2145 మంది రైతులచే 5855.96 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ సాగు చేయిస్తున్నారు.

నాబార్డ్ ఆర్థిక సాయంతో..

నాబార్డ్ ఆర్థిక సహాయంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని రాయగడ జమ్ము, దుడ్డుఖల్లు, బీరుపాడు, చాపరాయి బిన్నిడి, బాలేసు, నెల్లికిక్కువ పంచాయతీల పరిధిలోని 27 గ్రామాల్లో 586 మంది రైతులతో 1467.50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ సాగు చేయిస్తున్నారు.

సేంద్రీయ ఎరువులే వినియోగం

పంటల పెరుగుదలకు, అధిక దిగుబడులకు సహజ పద్ధతిలో పంటలను పండించడానికి ఆవుపేడ, ఆవు మూత్రం, బెల్లం, వేపాకు, సీతాఫలం ఆకు, పుట్ట మట్టి, మజ్జిగ తదితర సహజంగానే లభించే వస్తువులతో ఘన, ద్రవ జీవామృతాలు, పంచగవ్య, పుల్లటి మజ్జిగ మొదలగునవి, అలాగే పురుగులు, తెగుళ్ల నియంత్రణకు నీమాస్త్రం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, బీజామృతం, దశపరిని కాషాయం, తూటి కాడ కాషాయం, జిల్లేడు ద్రావణం మొదలగునవి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులచే తయారు చేయించి పంటలకు పిచికారీ చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అదనపు ఆదాయం కోసం..

కేవలం వరి పంటతోనే కాకుండా రైతులంతా అదనపు ఆదాయం పొందేందుకు రైతుల యొక్క జీడి, మామిడి తోటల్లో అంతర పంటలుగా పసుపు, అల్లం, పైన్ ఆపిల్, కొండ చీపుర్లు వంటివి సాగు చేసుకునేలా.. పెరటి తోటలు వేస్తూ కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ ఇంటి అవసరాలు తీర్చుకుంటూనే ఆదాయం పొందేలా ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో అవగాహన

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పెద్దగా నష్టం ఉండదంటూ నాబార్డ్, అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థికల సహకారంతో పనిచేస్తున్న జట్టు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్లవేలలా క్షేత్ర స్థాయిలో రైతుల్ని బలోపేతం చేస్తున్నారు. ప్రకృతి పరంగా సాగయ్యే పంటకు ప్రతికూల వాతావరణాన్ని తట్టుకునే శక్తి ఉంటుందని, చీడపీడలు ఎక్కడా దరి చేరవని, నాణ్యమైన ఉత్పత్తుల వలన చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని, పండించే పంటలకు మంచి డిమాండ్ ఉంటుందంటూ వారిని చైతన్యపరుస్తున్నారు.

ప్రకృతి సాగుకు ప్రోత్సాహం



రసాయన ఎరువుల వినియోగం వలన అనేక అనర్థాలు కలుగుతున్నాయి. క్యాన్సర్ వంటి రుగ్మతలకు పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగమే ప్రధాన కారణం. వీటి వినియోగాన్ని మాన్పించడానికి ప్రకృతి వ్యవసాయ విధానాల్ని రైతులంతా ఆచరించేలా ప్రోత్సాహం అందిస్తున్నాం. రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. తద్వారా పంట దిగుబడులు పెరుగుతాయి. సహజంగా పండించిన పంటలకు మార్కెట్లో మంచి ధరలు వస్తున్నాయి.

– డి.పారినాయుడు, జట్టు సంస్థ వ్యవస్థాపకుడు



గొరడలో కోనో వీడర్‌తో కలుపు వీడింగ్ చేస్తున్న రైతులు

ఖర్చులు తగ్గాయి..



రూ.10 వేలు ఖర్చు చేసి రసాయన ఎరువులు కొని చేసే వ్యవసాయం కంటే రూ.వెయ్యి రూపాయల ఖర్చుతో సేంద్రీయ వ్యవసాయం చేయవచ్చు.అలా చేస్తుండడం వల్ల పెట్టుబడి ఖర్చు పూర్తిగా తగ్గాయి. పైగా ఆరోగ్య కరమైన దిగుబడులు వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం ద్వారా ఆరోగ్యం బాగుంటుంది.

– తాడంగి బంగార్రాజు, రైతు, గొరడ గ్రామం

నాలుగేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నాను..



పెంగవ గ్రామంలో నాలుగేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నాను. రసాయన ఎరువుల వినియోగం మానేశాను. రైతుకు రెండు ఆవులు ఉంటే చాలు. ఆవు మూత్రం, వాటి పేడ నాలుగు ఎకరాలకు సరిపోతుంది. కషాయాలు పొలం చుట్టూ ఉన్న ఆకులతో తయారు చేసుకోవచ్చు. తొలుత కొంత దిగుబడి తగ్గినా తర్వాత అధిక దిగుబడులు వస్తున్నాయి. ఈ ధాన్యానికి మంచి గిరాకీ ఉంది.

–మండంగి కమల కుమారి, మహిళ రైతు, పెంగవ గ్రామం

చంద్రబాబు హయాంలో అప్పులే అప్పులు



కిల్లాడలో ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న నాయకులు

సీతంపేట: చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి అప్పులు పెరిగాయని వైఎస్సార్‌సీపీ పాలకొండ నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు ఆరోపించారు. మండలంలోని కిల్లాడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి వైఫల్యాలను వివరించారు. యువతకు నిరుద్యోగ భృతి.. ఆడబిడ్డ నిధి పథకాల జాడే లేకుండా పోయిందన్నారు. ఉచిత గ్యాస్ పథకాన్ని కూడా అంతంతమాత్రంగానే అమలు చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రం సస్యశ్యామలమైతే.. కూటమి హయాంలో అధోగతి పాలైందని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.వెంకునాయుడు, వి.సరస్వతి, కె.కీరయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గన్నెమ్మ, పార్టీ నాయకులు వి.రామారావు, కుమార్, దుర్గారావు, తిరుపతిరావు, కాంతారావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌లను సిద్ధం చేయండి

- ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



మాట్లాడుతున్న పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: గ్రామాల్లోని అవసరాలను గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు. బుధవారం స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో 13 మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, జిల్లా రిసోర్స్‌పర్సన్‌లతో కేంద్ర మంత్రిత్వశాఖ ప్రవేశపెట్టిన ఆది కర్మయోగి జిల్లా ఓరియంటేషన్ ప్రొగ్రాంలో భాగంగా మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో ఈనెల 8వ తేదీ నుంచి 12 వరకు ఆది కర్మయోగి గ్రామస్థాయి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ ఐదు రోజుల పాటు మండల అధికారులు, స్థానిక సిబ్బంది సమన్వయంతో సమస్యలను గుర్తించాలన్నారు. ఏ సమస్య ఉన్నా ఐటీడీఏకు తెలియజేస్తే తక్షణ పరిష్కారం చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఏఎంఓ కోటిబాబు, డీపీఓ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అవసరాలు గుర్తించాలి..



మాట్లాడుతున్న డీఈఈ బీఎంకే రెడ్డి, ఎంపీడీఓ రజనీకాంత్

భామిని: గిరిజనుల పూర్తిస్థాయి అవసరాలు గుర్తించి యాక్షన్ ప్లాన్‌లు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ బీఎంకే రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రజనీకాంత్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా 2030 నాటికి యాక్షన్ ప్లాన్‌లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ అలికాన సందీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్ల బిల్లులు చెల్లించాలి

గరుగుబిల్లి: గోకులం షెడ్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎంపీడీవో జి.పైడితల్లిని బుధవారం కోరారు. 2018–19లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వీటిని నిర్మించినా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని వాపోయారు. గత ఐదేళ్ల నుంచి బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ బిల్లులు చెల్లించడం లేదన్నారు. గోకులం షెడ్‌ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పీఎఫ్ డబ్బులు చెల్లించాలి

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ డబ్బులను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో పెస్ట్ కంట్రోల్, శానిటేషన్ వర్కర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కార్మికులకు రూ. 16 వేల చొప్పున జీతాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ.. పూర్తిస్థాయిలో చెల్లించడం లేదన్నారు. దీనిపై టీవీటీ యాజమాన్యంపై కేసు పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.దుర్గారావు, ఈవీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి



తనిఖీ బృందాలకు సూచనలిస్తున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు

గుమ్మలక్ష్మీపురం:

మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై తనిఖీలను సామాజిక తనిఖీ బృందాలు పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు అన్నారు. వెలుగు కార్యాలయం వద్ద బుధవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మిర్యాల మహేష్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ బృందాలకు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలంలోని 27 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 30 వరకు ఉపాధి హామీ పథకం నిధులు రూ.35 కోట్లతో చేపట్టిన పనులను సంబంధించి తనిఖీలు చేపట్టాల్సి ఉండగా ఆ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు సహకరించాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో మహేష్ మాట్లాడుతూ గ్రామాల్లో తనిఖీ బృందాలు ఈ నెల 4నుంచి 22 వరకు తనిఖీలు చేపడతారని తెలియజేశారు. సమావేశంలో జేఈ ఇ.శేషగిరిరావు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ



చలో విజయవాడ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కురుపాం: రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 6న చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులందరూ కదలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉదయపురం బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర ద్రోహాన్ని తలపెట్టిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామిని పూర్తిగా విస్మరించారన్నారు. చంద్రబాబు తల్లికి వందనంలో అనేక షరతులు పెట్టి 60 వేల మంది తల్లులను దూరం చేసిందని తెలిపారు. విద్యా రంగంలో సరళమైన మార్పులు తెచ్చి విద్యా రంగాన్ని గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ లో ఉన్న రూ.6500 కోట్ల ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



కిచెన్ గార్డెన్‌లో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు



సాక్షిలో ప్రచురితమైన కథనం

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కిచెన్ గార్డెన్ పాడైన విషయంతో పాటు అరకొర పనులతో నిలిచిపోయిన కెమిస్ట్రీ ల్యాబ్ తీరుపై, రూ. 4.25 లక్షలతో చేపట్టిన మైదానం పనులపై సాక్షి పత్రికలో ఈ నెల 2న 'నీరుగారిన లక్ష్యం' పేరిట కథనం ప్రచురితమైంది. దీంతో సమగ్ర శిక్ష అధికారులు, హైస్కూల్ సిబ్బంది స్పందించారు. సమగ్రి శిక్ష ఏఈ రామకృష్ణ పాఠశాలను బుధవారం సందర్శించి పరిస్థితిపై ఆరా తీశబూరు. కిచెన్ గార్డెన్‌లో మొలిచిన పిచ్చి మొక్కలను ఉపాధ్యాయులు తొలగించారు. అలాగే కొత్త మొక్కలు నాటారు.

వాతావరణ మార్పులపై అవగాహన



పోలీసకోటలో గిరిజనులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎఫ్‌డీఓ కేశవరావు

భామిని: మండలంలోని బండ్రసింగిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు వాతావరణ పరిస్థితులపై ప్రకృతి వ్యవసాయం రిసోర్స్‌పర్సన్ కె.దాసునాయుడు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చిరుధాన్యాల సాగు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించాలన్నారు. అనంతరం కొండపోడు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పోలీసకోటలో ఉమ్మడి వనరుల పెంపకానికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను ఎఫ్‌డీఓ కేశవరావు, సీసీ జగ్గయ్య వివరించారు. అనంతరం గిరిజనులచే మొక్కలు నాటించారు.

వైభవంగా వసంతోత్సవం



పాలకొండ రూరల్: భక్తులచే పూజలు అందుకుంటున్న దుర్గా గణపతి

పాలకొండ రూరల్: నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో కొలువైన శ్రీదుర్గా గణపతి మంటపంలో వసంతోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి గరిక, పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గురువారం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే కొత్తవీధి, గొల్లవీధి, గాసీ వీధుల్లో కొలువైన వినాయక మంటపాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

అన్న సంతర్పణ..

వీరఘట్టం: స్థానిక కూరాకులవీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణా సేవా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

సందడిగా నిమజ్జనోత్సవాలు..

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బత్తిలి, కాట్రగడ–బి, నేరడి–బి, గురండి, బిల్లుమడ, భామిని గ్రామాల్లో విగ్రహాలను మేళతాళాల నడుమ ఊరేగిస్తూ నదుల్లో నిమజ్జనం చేశారు. నేరడి–బిలో వినాయక లడ్డూను తిలారు ధర్మారావు 34 వేల రూపాయలకు సొంతం చేసుకున్నారు.



భామిని: బత్తిలిలో వినాయక విగ్రహం ఊరేగింపు

● లక్ష కుంకుమార్చన..



పాలకొండ పట్టణంలోని దక్షిణాముఖ ఆంజనేయ ఆలయంలో కొలువైన కాశీవిశ్వేశ్వర మంటపంలో బుధవారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణపతి సమేత శివపార్వతులకు పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు జోష్యుల ఆంజనేయశర్మ, తదితరులు పాల్గొన్నారు.

– పాలకొండ రూరల్

గణపతి లడ్డూ రూ.20,500

కురుపాం: మొండెంఖల్ గ్రామంలోని తోటపల్లి వీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేలం పాటలో లడ్డును రూ.20,500 వేలుకు సాకి అప్పన్న దక్కించుకోగా, వినాయకుని మెడలోని నోట్ల దండను రూ.51,500 వేలకు దీసరి గౌరీకుమారి దక్కించుకున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వేలంలో దక్కించుకున్న వారికి ఉత్సవ కమిటీ సభ్యులు సాకి ఉమాశంకర్, గుదారి రామారావు, ఇంటికుప్పల తిరుమలరావు, శ్రీను, ప్రసాద్, దిలీప్ ప్రత్యేక పూజలు, మేళ తాళాలతో లడ్డూ, నోట్ల దండను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గౌరీశంకరరావు, ఎంపీటీసీ విద్యారాణి, ట్రైబల్‌రైట్ ఫోరం అధ్యక్షుడు ఐ.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లిభద్రలో..

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిబద్రలో శివాలయం యూత్ ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి నివేదించిన 25 కిలోల లడ్డూను బుధవారం మండపం వద్ద వేలం నిర్వహించారు. ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన సారిక సునీత రూ.47,200లకు దక్కించుకొన్నారు. మరో ఆరు కిలోల లడ్డూను గ్రామానికి చెందిన వెలగాడ సింహాచలం దంపతులు రూ.18వేలకు దక్కించుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో ఉచిత కంప్యూటర్, ఇంగ్లిష్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు భోజన, వసతిసౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన వారు అర్హులన్నారు. ఈ నెల 12వ తేదీలోపు ధ్రువపత్రాలతో వైటీసీలో హాజరు కావాలని కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కోటిపాం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంకు అరలను అందజేసిన పూర్వపు విద్యార్థులు

కొమరాడ: మండలంలోని కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలల్లో 1998 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు తమ పాఠశాలకు రూ.12వేలు విలువ గల సామగ్రి, పుస్తకాలు వితరణ చేశారు. బుధవారం ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పూర్వపు విద్యార్థులు భాగస్వామ్యం కావాలని, మనం చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పూర్వపు విద్యార్థులు గంటా స్వర్ణప్రియా, సూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.